సాక్షి నిర్మల్

ఆదివారం । 23 । జూలై । 2023

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే రేఖానాయక్



సీఎం చాంబర్‌లో రేఖానాయక్

ఖానాపూర్/కడెం: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శుక్రవారం రాత్రి కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎంకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శనివారం మంత్రి ఐకేరెడ్డితోపాటు సీఎస్ శాంతికుమారిని వేర్వేరుగా కలిశారు. కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో నిర్మిస్తున్న గంగాపూర్ వంతెనకు అదనపు నిధులు కేటాయించాలని సీఎస్ శాంతి కుమారికి, పోడు సమస్యలపై ఐకేరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ దండె విఠల్, నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి



భోజనం రికార్డు పరిశీలిస్తున్న జడ్జి దేవేంద్రబాబు

ముథోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను భైంసా సివిల్ కోర్టు జడ్జి దేవంద్రబాబు శనివారం తనిఖీ చేశారు. తరగతి గదులు, ఆఫీస్‌రూం, పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించారు. స్టాక్, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి సౌకర్యాల గురించి ఆరా తీశారు. జడ్జి వెంట ఎస్సై సాయికిరణ్ ఉన్నారు.

నేరుగా వేతనాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

భైంసాటౌన్: ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న తమకు ప్రభుత్వం నేరుగా వేతనాలు ఇవ్వాలని భైంసా ఏరియా ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఏజెన్సీల ద్వారా సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని, ఈఎస్‌ఐ/పీఎఫ్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని తెలిపారు. తమ సేవలను గుర్తించి నేరుగా వేతనాలు జమచేయాలని కోరారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏటా నిర్ణీతమొత్తం అమలు చేయాలని కోరారు.

గోదాదేవికి పూజలు



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రం మల్లన్నగుట్టలోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆండాళ్ తిరునక్షత్రయుక్త మహోత్సవం, గోదాదేవి పుట్టినరోజు వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి గోదారంగనాథస్వాముల వారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సభ్యులు డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రభంజనం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ చేశారు. ఇందులో ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ఆర్టీసీ బస్సు

నిర్మల్‌టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం సాయన్న తెలిపారు. నిర్మల్ బస్టాండ్ నుంచి ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం 5.45 గంటలకు కలెక్టరేట్ నుంచి నిర్మల్ బస్టాండ్ చేరుకుంటుందని తెలిపారు. చార్జి రూ.20 ఉంటుందని, నెలవారీ రూట్‌పాస్ రూ.850కి జారీ చేస్తామని వివరించారు.

ప్రకృతి పిలుస్తోంది..

- జోరు వానలకు దుంకేస్తున్న జలపాతాలు..
- పురివిప్పిన ప్రకృతి అందం
- ఎటుచూసినా పచ్చదనమే
- జాగ్రత్తగా అడుగేద్దాం..

సండే స్పెషల్

నిర్మల్: 'ఆహా.. అటు చూడు ఒంపుసొంపుల సహ్యాద్రి.. నల్లంచు పచ్చచీర కట్టుకున్నట్లు ఎంత అందంగుందో..! వర్షపు జల్లుల పరవశంతో పురివిప్పిన మయూరంలా చుట్టూ విరిసిన అటవీ అందాలు.. కట్టిపడేస్తున్నాయి. అదిగదిగో ఆ దిక్కు.. దిగువన చూడు.. కొత్తనీళ్ల చేరికతో గోదారమ్మ పరుగులు పెడుతుందో..! అల్లంత దూరంలో ఎగసిపడుతున్న వాస్తాపూర్ జలపాతం.. తన అందాలు చూసేందుకు వస్తావా..? అన్నట్లు పిలుస్తోంది. ఆ మూలన పరవళ్లు తొక్కుతున్న కడెం ఒడ్డును చూడు. పాపికొండలను తలపించే అందాలతో రారమ్మంటోంది. ఇక ఘాట్లను దిగి కాస్త ముందుకు వెళ్లావా.. కుంటాల, పొచ్చెర, గాయత్రి.. ఒక్కటేంటీ ఎన్నో జలపాతాలు, ఆదిలాబాద్ అందాలు కనువిందు చేస్తూనే ఉంటాయి. ఇలా ఏ దారిన వెళ్లినా.. మనసుకు హాయినిచ్చే పచ్చదనం వెంటే వస్తుంది. చినుకుపడే వేళల్లో పచ్చని ప్రకృతి తన అందాలతో కనువిందు చేస్తూనే ఉంటుంది. సహజసిద్ధమైన అందాలున్న జిల్లా వానాకాలంలో మరింత సొబగులను అద్దుకుంది. కాస్త ఓపికతోపాటు జాగ్రత్తతో అలా అడుగు బయటపెడితే.. ఇలాంటివెన్నో ఆహ్లాదకరమైన అందాలను జిల్లా పరిచయం చేస్తుంది.



వాస్తాపూర్ జలపాతం

మెలికలు తిరిగిన సహ్యాద్రి ఘాట్‌రోడ్డు అందాలు..



సహ్యాద్రి అందం..

హైదరాబాద్–నాగపూర్ దారిలో ఎన్‌హెచ్.44పై వెళ్తుంటే.. నిర్మల్ జిల్లాకేంద్రానికి 10–12కి.మీ. దూరంలో సహ్యాద్రి పర్వతాల చివరి సానువులు పరిచయం చేసుకుంటాయి. ఒంపులు తిరిగే ఘాట్‌రోడ్డు, చుట్టూ పచ్చని, ఎత్తయిన చెట్లతో ఇట్టే ఆకట్టుకుంటుంది. ప్రకృతితో పాటు సాహసయాత్రలను ఇష్టపడే పర్యాటకులు, సందర్శకులకు ఈ రహదారి ఆహా..! అనిపిస్తుంది. ఘాట్ రోడ్డు ప్రారంభంలోనే కొంత దూరంలో ఇటీవల బాహుబలి పేరిట ఓ జలపాతాన్ని గుర్తించారు. కానీ.. అది కేవలం వర్షం ఎక్కువగా కురిసినప్పుడే పారుతుంది. ఘాట్‌రోడ్డు మధ్యలో ఉన్న వాచ్‌టవర్ నుంచి కిందికి వీక్షిస్తే.. పచ్చని అటవీ అందాలు మనసుకు ఎంతో హాయినిస్తాయి. కాస్త జల్లులు పడి, పొగమంచు కురుస్తున్నట్లుగా ఉన్న వేళ.. అలా సహ్యాద్రి మార్గంలో వెళ్తుంటే కశ్మీర్‌ను తలపించడం ఖాయం. ఈ ఘాట్లపైనే కాస్త ముందుకు వెళ్తే.. నల్లని గులకరాళ్ల గుండా పారే చిన్నచిన్న నీటి పాయల్లో ఇంటిల్లిపాది ఆనందంగా గడపొచ్చు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- వర్షాకాలం కనుక జలపాతాల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి.
- నీళ్లు పడే ప్రాంతంలో, దిగువ ప్రాంతంలో, నీళ్లల్లో అస్సలు ఉండొద్దు.
- జలపాతాల వద్ద ఎప్పుడు పైనుంచి వరద పెరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉంటాయి.
- స్థానికంగా వర్షం కురిసినా, కురవకపోయినా.. ఎగువ నుంచి వచ్చే వరదతో జలపాతం ఉప్పొంగవచ్చు.
- పచ్చని ప్రదేశాల్లో పాములు, తేళ్లు ఉండే అవకాశాలు ఉంటాయి. ఆచితూచి అడుగు వేయాలి.
- మనం వెళ్లే ప్రాంతంలో స్థానికుల సహాయం తీసుకోవడం మంచిది.

అలా.. అటవీ అందాల్లో..

పచ్చదనాన్ని ప్రేమించే, ప్రకృతిని ఆరాధించే ప్రేమి కులకు ఈ సీజన్‌లో జిల్లా స్వర్గంలా కనిపిస్తుంది. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే ఘాట్‌రోడ్డు మార్గమైనా, బైపాస్ రోడ్డయినా.. మొత్తం పచ్చని, దట్ట మైన అడవి అందాలతో ఆకట్టుకుంటుంది. బైపాస్ గుండా వెళ్తుంటే.. నేరడిగొండ మండలంలోని కొరిటికల్ జలపాతం కనిపిస్తుంది. ఇక ఇటు నిర్మల్ నుంచి మంచిర్యాల మార్గంలో ప్రయాణించినా దట్టంగా అల్లుకున్న అటవీ అందాలు కనువిందు చే స్తుంటాయి. పచ్చని అడవుల్లో కొలువుదీరిన కాల్వ, కదిలి పుణ్యక్షేత్రాల వైపు వెళ్లినా.. ఈ సీజన్ అందాలు ఆకట్టుకుంటా యి. లక్ష్మణచాంద, మామడ మండలాల్లోని పలు చెరువులు, వాటి గట్లు కూడా మనసును కట్టిపడేస్తాయి.

వాస్తాపూర్ వస్తారా..

ఆ ఊరికే ఓ పేరుంది. అక్కడి ప్రజలు మద్యం, మాంసాలకు దూరం. ప్రకృతిని నమ్ముకుంటూ ఆధ్యాత్మిక జీవనం సాగిస్తుంటారు. అలాంటి మనుషుల మధ్య కల్మషం లేకుండా స్వచ్ఛంగా పారుతోంది వాస్తాపూర్ జలపాతం. సహ్యాద్రి శ్రేణుల్లో నుంచే వచ్చే ఈ నీళ్లు ఈ గ్రామం వద్ద ఎత్తయిన ప్రాంతం నుంచి కిందకు దూకుతూ అలరిస్తాయి. నిర్మల్ నుంచి మామడ మండలంలోని తాండ్ర గ్రామం మీదుగా వాస్తాపూర్ వెళ్లాలి. ఎన్‌హెచ్ 44 బైపాస్ నుంచి కేవలం 5కి.మీ. మాత్రమే ఉంటుంది. నిర్మల్ నుంచి 20కి.మీ. వరకు వస్తుంది. అయితే ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. ఇంట్లోనే కావాల్సినవి వండుకుని వెళ్తే.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రకృతిలో గడపొచ్చు.



బాహుబలి జలపాతం..



వాస్తాపూర్ జలపాతం వద్ద సందడి...

కనువిందు చేసే కడెం..

జిల్లాలో టూరిజం శాఖ సౌకర్యాలు ఉన్న ఏకైక పర్యాటక ప్రదేశం కడెం ప్రాజెక్టు. జిల్లాకేంద్రం నుంచి మంచిర్యాల మార్గంలో నిర్మల్ నుంచి 50కి.మీ. దూరం ఉంటుంది. ఇక్కడ కడెం నదిపై కొండప్రాంతానికి ఆనుకుని కట్టిన ఆనకట్ట, బ్యాక్‌వాటర్ ఆకట్టుకుంటాయి. బ్యాక్‌వాటర్‌లో బోటు షికారు పాపికొండల ప్రయాణాన్ని తలపిస్తుంది. ప్రస్తుతం భారీ వరద వస్తుండటంతో బోటు షికారు నిలిపివేశారు.



మనసుకు హాయి..



నిత్యం ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాలతో బిజీగా ఉంటాం. ఇలాంటి ఉరుకులు, పరుగుల లైఫ్‌లో ప్రకృతే పెద్ద మందు. ఒక్కసారి పచ్చదనంలో అడుగుపెడితే మనసంతా హాయిగా ఉంటుంది. వాస్తాపూర్ జలపాతం చాలాబాగుంది. ఇక్కడ పెద్దగా ప్రమాదమూ లేకపోవడం ఆకర్షిస్తోంది.


– అనిల్ దంపతులు, నిర్మల్



సహ్యాద్రి ఘాట్‌లపై ప్రకృతి ప్రేమికుల సంబురం



జలపాతం వద్ద ఓ కుటుంబం సెల్ఫీ...



సహ్యాద్రి ఘాట్‌పై యువతుల సెల్ఫీ..

తెరిపివ్వని వాన



కడెం ప్రాజెక్టు దిగువన ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

- కడెంలో అత్యధిక వర్షపాతం నమోదు
- జిల్లాలో 61.9 మి.మీల సగటు వర్షపాతం
- ఖానాపూర్‌లో కూలిన ఇళ్లు

భైంసా: జిల్లాలో శనివారం వేకువజాము నుంచే వర్షం మొదలైంది. మధ్యాహ్నం కాస్త విరామం ఇచ్చి మరో గంటలోనే చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం కాస్త తెరిపివ్వడంతో రైతులు పొలంబాట పట్టారు. చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపారు. వరదలకు కాలువలు, వాగుల వెంట ఉన్న భూములు కోతకు గురయ్యాయి. మరో రెండురోజుల వరకు వ్యవసాయ పనులు చేసే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం సగటున 61.9 మి.మీల వర్షపాతం నమోదైంది. కడెంలో అత్యధికంగా 250.6 మి.మీలు, బాసరలో అత్యల్పంగా 16.2 మి.మీల వర్షం కురిసింది.

కూలిన ఇళ్లు..

భారీ వర్షానికి ఖానాపూర్‌లో ఇళ్లు కూలాయి. రోజూ కురుస్తున్న వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లో పురాతన, మట్టి ఇళ్లలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలతో గుండేగాం వంతెన నీట మునగడంతో వరుసగా రెండోరోజు రాకపోకలు నిలిచాయి. దేగాం వద్ద వాగు ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది. కామోల్, ఖత్గాం మధ్య రాకపోకలు నిలిచాయి. సిరాల ప్రాజెక్టులోనూ నీరు చేరింది. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. గడ్డెన్నవాగు, స్వర్ణ వాగు పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఉధృతంగా గోదావరి...

మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురవడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉండడంతో వర్షపు నీరంతా నేరుగా నదిలోకే వస్తోంది. ఒకవైపు మంజీరా, మరో వైపు గోదావరినది వరదనీటిని మోసుకొస్తుండడంతో బాసర వద్ద గోదావరి నిండుగా కనిపిస్తోంది. వంతెన పైనుంచి జలప్రవాహం చూస్తూ సెల్ఫీలు దిగారు.

'గడ్డెన్నవాగు'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 5,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 7,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, 358 మీటర్లు కొనసాగిస్తున్నారు.

కడెంకు తగ్గని వరద

కడెం: కడెం ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి భారీగా వరద వస్తోంది. శనివారం ఉదయం లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో.. 14 వరద గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. రాత్రి వరకు ఇన్‌ఫ్లో 35,502 క్యూసెక్కులకు తగ్గడంతో నాలుగు వరద గేట్లు మూశారు. రాత్రి మరో ఆరు గేట్లు మూసి నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు మొరాయించిన వరద గేట్లకు మెకానికల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, గణేశ్ పనులను పర్యవేక్షించారు.

శనివారం జిల్లాలో కురిసిన వర్షం వివరాలు..

మండలం	వర్షపాతం(మి.మీలలో)
కుభీర్	52.4
తానూరు	34.4
బాసర	16.2
ముథోల్	24.2
భైంసా	33.00
కుంటాల	44.4
నర్సాపూర్	15.8
లోకేశ్వరం	22.2
దిలావర్‌పూర్	47.8
సారంగపూర్	74.8
నిర్మల్	37.4
నిర్మల్‌రూరల్	38.6
సోన్	35.6
లక్ష్మణచాంద	42.4
మామడ	50.2
పెంబి	142.4
ఖానాపూర్	91
కడెం	250.6
దస్తురాబాద్	123.2

'స్వర్ణ'కు పెరిగిన వరద

సారంగపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. తెల్లవారు జామున 4 గంటలకు 8,800 క్యూసెక్కుల వరద రావడంతో రెండు గేట్లు ఎత్తి 5,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఉదయం 10 గంటలకు ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేటును మూసివేశారు. ప్రాజెక్టు నీటిమట్టం 1,179 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.



రెండు గేట్ల నుంచి దిగువకు వరద...

ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

స్వర్ణ ప్రాజెక్టును కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఈఈ రామారావుతో మాట్లాడి ప్రాజెక్టు పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను పరిశీలించారు. ప్రాజెక్టు గేట్ల మొరాయింపు ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఫ్లో భారీగా వస్తే గేట్లు ఎత్తిన సమయంలో నది పరీవాహక పంటలు దెబ్బతింటున్నాయని ఈఈ తెలిపారు. అనంతరం వరద తాకిడికి కోతకు గురైన పాట్య గ్రామ ప్రధాన రహదారిని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో లక్ష్మారెడ్డి ఉన్నారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- కలెక్టర్ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ఎఫ్‌సీఐకి అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ డెలివరీ చేసేందుకు సరిపడా గోదాంలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మిల్లర్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలు, హమాలీల కొరతతో సకాలంలో అందించలేక పోతున్నామన్నారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్ల సీఎంఆర్ 2.12 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. సామర్థ్యం గల గోదాములు కావాలని, డిచ్‌పల్లితోపాటు ఆదిలాబాద్ లాంటి వాటికి అనుమతి ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సీఎంఆర్ డెలివరీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బియ్యం నిల్వలకు సరిపోను గోదాములను కేటాయించాల్సిన బాధ్యత ఎఫ్‌సీఐపై ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలని సివిల్‌సప్లయ్ అధికారులను ఆదేశించారు.

ఫోన్ పోతే ఆందోళన వద్దు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఇక ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. https://www.ceir.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న తొమ్మిది మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం కోగా, వాటిని శనివారం బాధితులకు అందజేశారు. ఫోన్‌లను వెతకడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు.



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఐటీకోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు ని ర్వహించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయి న పి.రాంబాబు వీడ్కోలు సమావేశం సమీకృత కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శాలువాతో స న్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు అందించిన సేవలను ప్రశంసించారు. నిర్మల్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన ఆర్డీవో స్రవంతి అదిలాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా శాలువాలతో సన్మానించి మెమొంటో అందించారు. కార్యక్రమంలో డీఆర్వో లోకేష్., తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో కూలిన సీలింగ్



కూలిన సీలింగ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రెండో, ఐదో అంతస్థుల్లోని సీలింగ్ వర్షాలతో శనివారం కుప్పకూలింది. ఆ సమయంలో రోగులు, వైద్య సిబ్బంది లేక పెను ప్రమాదం తప్పింది. రెండో అంతస్థులో ఆపరేషన్ థియేటర్‌తో పాటు కార్డియాలజీ వార్డు ఉండగా, ఐదో అంతస్థును ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అక్కడికి చేరుకుని సీలింగ్ కూలడానికి గల కారణాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపునీరు లీకేజీ కారణంగా సీలింగ్ పడిపోయిందని వారు డైరెక్టర్‌కు వివరించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడిన డైరెక్టర్ యథాస్థితికి తీసుకురావాలని ఆదేశించారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిర్మల్ జిల్లా స్వీపర్ల సంఘం అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్వీపర్లకు ఉత్తర్వులతో సంబంధం లేకుండా వేతనాలను చెల్లిస్తున్నారని అన్నారు. 112, 212 ఉత్తర్వుల ప్రకారం స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురవుతున్నందునే స్వీపర్లంతా ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్నప్పటికీ వారికి నేటికీ న్యాయం జరగడం లేదన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రహశకలాల అన్వేషణలో పాల్గొనండి

నిర్మల్ రూరల్: ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ సెర్చ్ క్యాంపెయిన్ (నాసా భాగస్వామ్యంతో) గ్రహశకలాల పరిశోధనలో విద్యార్థులు పాల్గొనే అవకాశాన్ని కలెక్టర్, విద్యాశాఖ అవకాశం కల్పిస్తోందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 9, 10 తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 9, 10వ తరగతి చదువుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, వివిధ యాప్‌ల్లో శోధించకలిగే సామర్థ్యం గలవారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తమ పేర్లను ఆదివారంలోగా నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ వినోద్‌ను సంప్రదించాలని కోరారు.

కలప దొంగల అరెస్టు

ముథోల్: టేకు కలప దొంగలను పట్టుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వివరాల ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి ముథోల్‌కు చెందిన కొనుపాక్ మధుకర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని టేకు చెట్లను బులోరా వాహనంలో వచ్చిన దొంగలు నరుకుతుండగా గమనించిన పలువురు రైతుకు సమాచారం ఇచ్చారు. సదరు రైతు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. మరో నలుగురు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదే క్షేత్రంలో గత నెల 26న రూ.15లక్షల విలువ చేసే 24 టేకు దుంగలు దొంగలు ఎత్తుకెళ్లారు.

అతలాకుతలం

ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం తల్లడిల్లిపోతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో జనజీవనం అతలాకుతలమవుతోంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే వంతెనలపై నుంచి వాగులు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్లుకు కోతకు గురికాగా, ఇళ్లు కూలిపోతున్నాయి.

ఇళ్లలోకి వరద

కైలాస్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆదిలాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లపైకి వరదనీరు ప్రవహిస్తుండగా ఇళ్లలోకి వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీఎస్ ఎస్టేట్ కాలనీ పూర్తిగా జల దిగ్బంధనంలో చిక్కుకుంది. కాలనీలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వాహనాలు సైతం అతికష్టం మీద ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. అదే విధంగా పట్టణంలోని తాటిగూడ, వికలాంగుల కాలనీ, బంగారుగూడ, ఖానాపూర్, సర్వే నంబర్ 170 కాలనీల్లో వరదనీరు భారీగా వచ్చి చేరింది. రోడ్లపై మోకాల్లోతు నీరు నిలువగా, పలు ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఇళ్లలోని నిత్యావసర సరుకులతో పాటు సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. అలాగే సర్వే నెంబర్ 170లో భారీగా వర్షపునీరు నిలిచి ప్రజలు రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ఈ విషయం తెలియడంతో వెంటనే కాలనీకి చేరుకున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సహాయక చర్యలకు ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో తవ్వకాలు చేపట్టి వరదనీటిని బయటకు పంపించేలా చర్యలు చేపట్టారు.



వికలాంగుల కాలనీలో ట ఇంటి ఆవరణలో చేరిన వరద



కడెం: పొంగి ప్రవహిస్తున్న పెద్దమడుగు



కైలాస్‌నగర్: వరద వెళ్లేందుకు పనులు..



కడెం: రోడ్డుపై చేపలు పడుతున్న స్థానికులు

జలదిగ్బంధంలో నాలుగు గ్రామాలు



బెదోడ గ్రామ శివారులో పెన్‌గంగ బ్యాక్‌వాటర్

బేల: కురుస్తున్న వర్షాలతో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మండలంలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతాలైన బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాలు శనివారం జలదిగ్బంధంలోకి వెళ్లాయి. దీంతో ఈ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. సాంగిడి రింగ్ రోడ్డు మార్గంలోని ఈ నాలుగు గ్రామాలతో పాటు సాంగిడి, దహెగాం గ్రామాల శివారుల్లోని లోలెవల్ వంతెనలపై వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ ఆరు రెవెన్యూ గ్రామాలతో పాటు కోగ్దూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారుల్లో మొత్తంగా 1,300 ఎకరాల వరకు పంట పొలాలు పూర్తి నీటమునిగినట్లు వ్యవసాయ బృందం అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.



హస్నాపూర్ గ్రామంలో ఇళ్లలో చేరిన వరద

స్మశానవాటికలోకి వరద ప్రవాహం



పెన్‌గంగ నదిఒడ్డున దహన సంస్కారాలు

తాంసి: పెన్‌గంగ నది వరద ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చడంతో భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన స్మశాన వాటికలోకి వరద నీరు వచ్చి చేరింది. శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన తుకారం అనే వృద్ధుడు వయోభారంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు చేసేది లేక పెన్‌గంగ నది ఒడ్డున వృద్ధుడి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కోతకు గురైన బ్రిడ్జిపై యువకుల కాపలా



వంతెనపై వరదలో కాపలాగా యువకులు

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్, అర్లి(టి) గ్రామాల మధ్య అంతర్రాష్ట్ర రోడ్డుపై వంతెన వర్షాలకు కోతకు గురైంది. కోతకు గురైన బ్రిడ్జిపై పూర్తిగా వర్షపునీరు నిలిచింది. బ్రిడ్జిపై వరద నీరు అధికంగా నిలువడంతో ఎక్కడ బ్రిడ్జి ఉందో ఏటు వైపు బ్రిడ్జి కోతకు గురైందో తెలియని పరిస్థితి. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని అర్లి(టి) గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన టీకం దిలీప్, అశోక్, నితిన్, ఆకాష్ అనే యువకులు బ్రిడ్జి వద్ద కాపలాగా ఉండి వాహనదారులకు సూచనలు చేశారు. కోతకు గురైన బ్రిడ్జి వైపు పెద్ద చెట్టు దుంగను సైతం ఏర్పాటు చేశారు.

ముసురులో చేపల వేట

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంలో పలు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని కంచరవుని చెరువు, చుట్టుపక్కల ఉన్న కుంటల్లో స్థానికులు చేపల కోసం వలలు పట్టుకుని, పారుతున్న నీటిలో కొందరు యువకులు కర్రలు పట్టుకుని చేపలు వేటలో నిమగ్నమయ్యారు. చిన్నపిల్లలు చీరలు పట్టుకొని చేపల కోసం ప్రయత్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పొంగుతున్న కడెం వాగు



కుప్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం వాగు

నేరడిగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం కడెం వాగు ఉగ్రరూపం దాల్చడంతో వరదనీటి తాకిడికి వాగు సమీపంలోని ప్రాంతాలు కుప్టి, కుమారి, గాజలి, గాంధారి, తర్నం, వాగ్దరి, మాదాపూర్, వెంకటాపూర్, కుంటాలతోపాటు ఆయా లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లోని పంట పొలాలు జలమయమయ్యాయి. వేలాది ఎకరాల పత్తి, సోయా, కంది పంటలు నీటమునిగి తీవ్రనష్టం వాటిల్లింది. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చేటట్లు కనబడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం వాగు

అపార నష్టం



వర్షం కారణంగా కూలిపోయిన ఇల్లు



బ్యాక్‌వాటర్‌లో నీటమునిగిన పంటపొలాలు

ఖానాపూర్: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కడెంకు భారీగా వరదవచ్చి చేరుతోంది. కడెం బ్యాక్‌వాటర్‌తో మండలంలోని ఎర్వంతల్, కోలాంగూడ పంచాయతీల పరిధిలోని రైతుల పత్తి, మొక్కజొన్న, పసుపు తదితర పంటపొలాలు నీటమునిగాయి. బ్యాక్‌వాటర్‌తో యేటా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందడం లేదు. మండలంలోని పాత ఎల్లాపూర్ – నడింపల్లె మధ్య గల రోడ్డుడ్యాంతో పాటు కొమ్ముతండా చొంతొర్రె, తదితర రోడ్డు డ్యాంలపై నీరుపారడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఖానాపూర్ నుంచి దిలావర్‌పూర్, తర్లపాడ్ గ్రామాలకు వెళ్లే మార్గంలోని రెంకోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన ఆడెపు నర్సయ్య ఇళ్లు వర్షంతో తడిసి కూలిపోయింది.

గోదావరిలోకి భారీగా వరద



గోదావరిలోకి వెళ్తున్న వరదనీరు

ఖానాపూర్: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని సదర్మాట్‌కు వస్తున్న భారీ వరద గోదావరిలోకి వెళ్తోంది. సదర్మాట్ గరిష్ఠ నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 8.4 ఫీట్లలో నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చిన 7168 క్యూసెక్కుల వరద నీరు గోదావరిలోకి వెళ్తోందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. సదర్మాట్ వద్ద పెరిగిన వరద ఉధృతిని చూసేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సదర్మాట్ వద్ద ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరికి లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం లేదు.



వాగులో కొట్టుకొచ్చిన మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో శనివారం ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిందని ఎస్సై నాగనాథ్ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురికి తరలించారు. మృత్యుడు వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉంటుందని వివరించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే ఆదిలాబాద్ రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన గుర్రపు రాజు(23) శనివారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్సై కె.రాజు వివరాల ప్రకారం... గుర్రపు రాజు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన దంతె సాయన్న ఇంటి ఎదుట అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. యువకుడి మృతదేహాన్ని గమనించిన కాలనీవాసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుర్రపు రాజు తల్లి రుక్మాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కస్తూరిబాలో పాము కలకలం

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఇద్దరు బాలికలు మూత్రశాలలకు వెళ్తుండగా పాము వారి కాళ్ల మధ్యలో నుంచి వెళ్లింది. దీంతో వారు ఆందోళనకు గురికావడంతో వారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు ప్రమాదం ఏమి లేదని తెలిపాడు. అనంతరం పరిశీలన కోసం భైంసాలోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా విద్యార్థినులు పామును చూసి బయపడ్డారని, పరిశీలన కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ కడెంపై లేదు

- టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్



వరదగేట్లను పరిశీలిస్తున్న భరత్‌చౌహాన్

కడెం: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ కడెంపై లేదని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్ అన్నారు. కడెం గేట్లు మొరాయించడంతో శనివారం ప్రాజెక్ట్‌ను సందర్శించి సీఈ శ్రీనివాస్‌తో మాట్లాడారు. మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. గత ఏడాది వర్షాలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్‌కు సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని, కమీషన్లు రావనే కడెం ప్రాజెక్ట్‌ను పట్టించుకోక.. వందల కోట్ల రూపాయలు కాళేశ్వరానికి పెడుతున్నారని, కడెం ఆయకట్టు రైతులు ఏ పాపం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, వెంకటేశ్, ప్రతాప్ ఉన్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ స్టేట బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథ్ శనివారం సందర్శించారు. సంస్థ అందిస్తున్న శిక్షణపై అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తూ నిరుపేదలైన ఒకరికి తనవంతుగా కుట్టుమిషన్ అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆసిఫాబాద్ జిల్లా పారా గ్రామానికి చెందిన వికలాంగురాలైన పూసం గొడస్‌కు కుట్టుమిషన్ అందించారు. ఉచిత శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేడు మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్, నిర్మల్ అడిషనల్ డీఆర్డీవో గోవింద్‌రావు, డీపీఎం జ్ఞాను, అన్నాజీ, సంస్థ సిబ్బంది ఆశన్న, మల్లయ్య, సతీష్, రమేశ్, బాబు ఉన్నారు.



కుట్టుమిషన్ అందిస్తున్న దృశ్యం

బాబెరలో క్షుద్ర పూజల కలకలం



పాఠశాలలో ఉన్న పసుపు, నిమ్మకాయలు

బోథ్: మండలంలోని బాబెరా తండా గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహించారు. శనివారం పాఠశాల అవరణలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు స్థానికులకు కనిపించాయి. ఎవరో క్షుద్ర పూజలు నిర్వహించారని గ్రామస్తులు పేర్కొన్నారు. పాఠశాలలో ఇలా పూజలు చేయడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్ నిర్వహకుడిపై కేసు

గుడిహత్నూర్: నకిలీ కుల ధృవీకరణ పత్రం తయారు చేసి ఇచ్చిన ముర్కుటే బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రహమాన్ తెలిపారు. మండలంలో బోగస్ సర్టిఫికెట్ల దందా పేరున శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో తహసీల్దార్ సంధ్యారాణి కార్యాలయ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ ఇనేష్‌తో ఫిర్యాదు చేయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.